దాన్లోంచి పామొచ్చినట్టయి
అతను విసిరేస్తే
కుక్కి మంచంమీద
పొరలు విప్పుకొని
పసుపులో ముంచిన
కళ్ళ కలక గుడ్డలా
కన్నె కన్నుకి కాటుక చెరిగి
కామెర పట్టినట్టు
    అసహ్యంగా
    పడుంది అతను ముందు రాత్రి
    షాపు ట్యూబులైట్లు
    కళ్ళలో గుచ్చుకొని
    రంగుల బేధం
    తెలియక
    కొన్న
    పచ్చచీర

❖ ❖ ❖

ఆ చీర కింద
పుని స్త్రీ శవం పడుకున్నట్లయి
    అతనికి
    కన్నీళ్ళొచ్చేయి.

(1976)

# జాలీ నోట్

**నా**కు దెయ్యం అంటే భయం లేదు, దేవుడంటే భక్తీలేదు.

పాపూ, దొంగా వగైరాలంటే కేరే జాట్.

"మరీ యింత భయభక్తుల్లేకుండా తయారైందేవిటమ్మా యీ పిల్ల! అసలే ఆడపిల్ల కూడాను" అని నా చిన్నప్పుడుమా అమ్మ తెగ బెంగ పెట్టుకునేది.

కాని నాలొసుగు ఆవిడకి తెలీదు. నాకు వర్షం అంటే విపరీత మైన భయం. భూమ్మీద చినుకుపడితే మరింక నేను భూమ్మీద కాలు పెట్టను. "అంటు" "సొంటు" అంటూ మా అమ్మ ఆరవక పోతే అన్నం కూడా మంచం మీదే తినేస్తాను.

అప్పటికి రెండ్రోజుల నుండి ఆగకుండా వర్షం కురుస్తోంది. సూర్యుడనేవాడు ఉన్నాడన్న సంగతే మరిచిపోయేం. మరింత ఈ వర్షం యిలాగే యింకో నాలుగు రోజులు గనక పడితే మనుషులంతా నానిపోయి మొక్క మొలచి పోతారేమో నన్న భయం పట్టుకుంది అందరికీ.

అదిగో, సరిగ్గా అప్పుడే నేను రైల్వే స్టేషన్‌కి వెళ్ళవలసి వచ్చింది. మామూలుగా అయితే ఆ పరిస్థితులలో దేవుడు ప్రత్యక్షం అవుతానన్నా దర్శనం యివ్వను. కాని ఆ వస్తున్నది పతి దేవుడు. నాకు వర్షం అంటే ఎంత భయమో మా వారంటే అంతకు రెట్టింపు వణుకు.

"ఇంత వర్షంలో స్టేషను కెందుకే. స్టేషను నుంచి ఇంటికి రాడా ఏవిటి! మరీ చాదస్తం" మా అమ్మ భయం. ఎంతైనా తల్లి ప్రాణం.

రాకపోయినా పోవచ్చు. ఏ మొగుడి సంగతి ఆ పెళ్ళానికే తెలుస్తుంది. నాకు చిన్నప్పటి నుంచి వర్షం అంటే ఏదో తెలీని భయం ఏర్పడబట్టి కాని లేకపోతే ఇన్నేళ్ళు మావారితో కాపురం చేసిన నాకీ తుపానొక లెక్కకాదు.

ధైర్యం, చీరాకూడ దీసుకు బయలుదేరేను. నా వెర్రి కాని యీ టైములో రిక్షా లెక్కడ దొరుకుతాయి? కనుచూపులో ఎక్కడా జన సంచారం లేదు.

ప్రళయం తరువాత ప్రశాంతతలా అంతా నిర్మానుష్యంగా ఉంది.

మా కాంపౌండులో ఉన్న వేపచెట్టు అమ్మవారు పూనిన దానిలా ఊగుతోంది. అది గనక విరిగితే మా ఇల్లు చేగోడీలా ముక్కలై పోతుంది.

ఎదురుగా ఉన్న కాకా హోటలుచూరుకింద మాత్రం ఓ కుక్క చలికి ముడుచుకొని పడుకుంది.

దూరంగా ఏదో కారు వస్తున్నట్టుంది.

హెడ్‌లైట్ల వెలుతురులో వర్షం చినుకులు వెండి సూదుల్లా మెరుస్తూ రోడ్డుమీద నడిచిపోతున్న ఒక పిచ్చి ముష్టిదానికి గుచ్చుకుంటున్నాయి.

ఆ కారువాళ్ళకి నాకంటే అర్జంటు పని తగిలిందో? లేక పోతే సినిమాలోలా వర్షంలో షికారుకెళ్ళాలనిపించిందో? ఏది ఏమైనా చెయ్యూపేను ఆపమని, నేను ఇండియాలో ఉన్నానన్న సంగతి మరిచిపోయి. అది ఇండియన్ కారులాగే – అంటే ఇండియన్ తాలూకు కారులాగే – లేచి పోయింది.

ఇదిగో ఇలాంటప్పుడే నాకు భక్తులంటే పరమ అసూయ కలుగుతుంది. వాళ్ళయితే భగవధ్యానం చేస్తారు. నాకైతే కార్ల వాళ్ళని జనరల్‌గాను, ఆ కారువాడిని స్పెషల్‌గాను తిట్టాలని వగైరా వెధవ ఆలోచన్లు వస్తాయి.

మళ్ళీరావడానికే అన్నట్టు వర్షం కొంచెం తగ్గింది.

పక్క హోటలు దగ్గర ఏదో రిక్షా ఆగింది.

"ఏయ్ రిక్షా" అని కళ్ళు మూసుకుని అరవగలిగినంత గట్టిగా అరిచేను, యింకెవయినా తన్నుకుపోతారన్న భయంతో.

వచ్చింది రిక్షా.

పక్కన రిక్షా లేకపోతే ఆ రిక్షావాడ్ని ముష్టివాడనుకుంటారు. అతను ముసలివాడే. కాని అందరిలా పుట్టి పెరిగి ముసలి అయినట్టుగా కాక పుట్టడమే ముసలివాడుగా పుట్టినట్టున్నాడు. అతని బట్టలు చిరగక పోయినా చిరిగినట్టే కనిపిస్తాయి. ఎప్పుడూ ఆకలి తీరని మనిషిలా నీళ్ళల్లో కసికాకుండా దైన్యంతో నిలబడి ఉన్నాడు.

మీరంతా నాకు ఎంత అన్యాయం చేసినా తిరగబడను కాక తిరగబడను అన్నట్టు హెల్ప్‌లెస్‌గా ఉంది అతని ఎక్స్‌ప్రెషన్.

అతన్ని చూస్తేబేరం చెయ్యాలనిపించలేదు. నెలాఖరయినా అతనెంత అడిగితే అంతా యిచ్చేద్దాం అనిపించింది. నాది స్వతహాగా జాలిగుండె కాకపోయినా.

"ఎక్కండమ్మా" అన్నాడు వాడు తన తుడి తువ్వాలుగా సీటు తుడుస్తూ. సీటు యింకొంచెం తడిసింది.

"కొంచెం వేగం పోనీ బాబూ రైలు స్టేషన్‌కి, టైమైపోయింది" అన్నాను అసంభవం అని తెలిసినా.

"ఏ బండి కండి?"

చెప్పేను.

"ఆ బండి ఎప్పుడూ లేటేనండి. దానికంటే నా రిచ్చాబండే జోరుగెల్తాదండి. దాని డయివోరు గాడికి ఎండకాస్తే ఆయాసం, వొరసం పడితే ఉబ్బసవూనండి" అని అభయం యిచ్చేడు.

వాడి మాటల ధోరణి నాకంత నచ్చలేదు. అనవసరంగా చొరవ చేసుకుంటున్నాడేమో అనిపించి అతని స్థానం అతనికి తెలియ చెయ్యాలని ముభావంగా ఉన్నాను.

వర్షం కంటే గాలి ఎక్కువగ ఉన్నందువల్ల రిక్షా తొక్కలేక దిగి లాగడం ప్రారంభించేడు. ఎదురుగాలి వెనక్కి తోసేస్తుంది. వాడు ముందుకి లాగుతున్నాడు.

"తవరుగోరికి పిల్లలెంత మందండి?" రొప్పుతూనే ప్రశ్నించేడు.

"నలభై" అందా మనిపించింది. చొరవ యిస్తే నెత్తెక్కి పోతారు యీ అలగాజనం.

నా సంతాన మెంతమందో తెలుసుకున్నాక వాళ్ళ చదువులు, పెళ్ళిళ్లు వగైరా వివరాలన్నీ అడిగేడు.

"మీ కేటి? నీ కూతుర్లు లేడీ డాక్టర్లయిపోతారు".

(అనవసర ప్రసంగం. కూతుర్లు లేడీ డాక్టర్లు కాకుండా మొగడాక్టర్లెలా అవుతారు?)

అంతవరకూ అతని మీదున్న సానుభూతి పూర్తిగా పోయింది. ఎదురుగానీ, వీడూ యుద్ధం చెయ్యగా చెయ్యగా ఎలాగైతేనేం మెడికల్ కాలేజీ దగ్గర కొచ్చేం.

ఎదురుగా బ్రిడ్జికి ఓ వంద గజాలు అటు, ఓ రెండు వందల గజాలు యిటు గోదావరిలా పారుతోంది నీరు. కొత్తవారెవరైనా ఆ బ్రిడ్జిమీంచి చూస్తే కింద ఏదో నది ఉందనీ, ఆ బ్రిడ్జి బేరేజి అని అనుకుంటారు.

భగవాన్ ! యీనీట్లో రిక్షా ఎలా వెళ్తుంది?

"ఆగాగు!" అరిచేను. ఆగేడువాడు.

"ఇంత నీటిలో లాగలేవు. రిక్షా ఇంటికి పోనీ" అన్నాను. నా మాటల్లో వాడిమీద సానుభూతి కంటె నా ప్రాణ భయమే ఎక్కువుందేమో.

"భలేవోరే. యీ మాత్తరానికేనా. మీకేం బయ్యం నేదు. కాక పోతే కొంచెం కాళ్ళు తడుస్తాయి" అంటూలాగడం ప్రారంభించేడు, అక్కడికీ నేనేదో పొడిగా ఉన్నట్టు.

రిక్షాలోకి నీళ్ళొచ్చేస్తున్నాయి. నీటి ఫోర్సుకి రిక్షా ఓ పక్కకి లాగేస్తోంది.

"మరండి, యీ తోవనే పెద్ద పెద్ద డాకటర్లు ఎళతారు. యీ దారమ్మటే జడిజి కోరటు ఉంది. స్టేటు బేంకి ఉంది. పెద్ద పెద్దోళ్ళంతా యీ రోడ్డంబడే ఎళ్తారు. ఒకడైనా ఆ మునిసిపాలిటీ నంజికొడుకుని యీడుసుకొచ్చి యీ గోదారి సూపెట్టి యిదేవిడని అడగడండి. పన్నులు డబ్బంతా తీనీడవేగాని ఏ రోడ్డూ బాగుచెయ్యరు. అడిగేవోడు నేడు. అంతే...."

నీపాటి బుద్ధి మున్సిపాలిటీకి ఉంటే బావుణ్ను.

".... ఆఁ, ఆఁ ఆగాగు. బండిలో ఆడవాళ్ళున్నారు" అన్న వాడి కేకకి తలెత్తి చూసేను, ఎదురుగా బ్రహ్మ రాక్షసిలా వచ్చేస్తోంది బెంజ్‌లారీ.

వీడిలా 'ఆగాగు' అని అరుస్తూనే వున్నాడు, వాడు లారీడు నీళ్ళు నామీద జల్లి ఝూమ్మని వెళ్ళిపోయేడు.

"శ్ఛ! శ్ఛ! తాగుబోతు నంజికొడుకు. ఆడోళ్ళున్నారన్నా ఆగలేదు. ఈ నారీ నంజకొడుకులకి కళ్ళు ఆగపడవండి. పగలే తాగేసి బండెక్కుతారు...." అంటున్నాడు, వాడు రాత్రి తాగి నడిపితే ఫరవాలేదన్నట్టు.

ఆ లారీ జల్లిన నీళ్ళకి నా చీరంతా బురద చుక్కత్తో ప్రింటెడ్ చీరలా ఉంది.

వాడు లారీవాడ్ని బూతులు తిట్టడం పూర్తి చేసేసరికి మధ్యలో ఉంది రిక్షా నీటిలో రోడ్డుమీదున్న గొయ్యి కనిపించక అందులో రిక్షా చక్రంపడి, నేను క్రిందపడ్డంత పనైంది.

"నీటిలో గొయ్యి అగుపించనేదండి" ఎపోలెజెటిగ్గా అంటూ చక్రాన్ని బయటికి లాగే ప్రయత్నంలో మునిగిపోయేడు. ఈలోగా రేసులో ఉన్న రాజహంసలా ఒక ఫారిన్ కారు మా పక్క నుంచి దూసుకు పోయింది. అది చిమ్మిన నీటికి రిక్షావాడు పూర్తిగా తడిసిపోయేడు. వాడు అడ్డం ఉండటంవల్ల నేను బతికి పోయేను.

"నంజికొడుకు తలంటేసినాడు" బుర్రకు చుట్టిన తడి తువ్వాలు తీసి, ఒళ్ళు తుడుచుకోవడం మొదలు పెట్టేడు.

".... ఇలాంటి ఎదవల మీద కోరట్లో కేసెట్టి ఆర్నెల్లు జైలు కట్టెయ్యాల నాయం ఉంటే. ఎంత కారుంటే మాత్తరం యిలా మాలాటోళ్ళని బురదలో జలకాలాడించేస్తాడా?"

"నిజవేఁ" ఊఁ కొట్టేను పరధ్యానంగా.

".... నా ఎర్రిగాని అక్కడ మాత్తరం ఆడిమాటే సెల్లుద్ది గాని...."

"ఎక్కడ?" ఊహల్లోంచి ఉలికిపడి బయటకొచ్చి అడిగేను.

"కోరట్లో"

నాకు ఏమనలాలో తోచలేదు. సరదా అనిపిస్తే సినిమాకి వెళ్ళొచ్చు, సర్కసుకు వెళ్ళొచ్చు.కాని వీడికి ఈ కోర్టు పిచ్చేమిటో!!

"...... అక్కడా ఆడి ఆటే సెల్లుద్ది, అక్కడా ఆడి మాటే సెల్లుద్ది. నానే కార్లో ఎల్తూ ఆడిమీదికి నీళ్ళు మళ్ళించేసి ఆడికి వారం రోజులు నష్టం తెప్పించేసినానని బోధించి కోరట్నిం నమ్మిం చేసి తప్పుడు కేసెట్టి నందుకు నాకే జుల్మానో, జైలో ఏయించేస్తాడు ....." మధ్యలో ఆయాసం తీర్చుకోవడానికి ఆగేడు. చక్రం గోతిలోంచి బయటికొచ్చేసింది కూడా.

"అంతా అన్యాయవాఁ?" అడక్కుండా ఉండలేక పోయేను.

"అన్యాయవాఁ? అన్యాయంన్నారా? కోరట్లోనే అన్న మాటేటి? నోకంలో గొప్పోడిమాట సెల్లని సోటేది ? అందుకే అన్నారు తప్పుడుపని పెద్దోళ్ళు చేస్తే పేమా, పిన్నోళ్ళు చేస్తే రంకూ అని. అంతెందుకు నానూ, తవఁరూ ఓ సాపు కెళ్తాం. సిగరెట్టు పెట్టో ... శ్ఛీ ..శ్ఛీ .. మీరు ఆడోరు. సిగరెట్టు పెట్టె, బీడీకట్టా ఎందుగ్గని సబ్బు బిళ్ళో, సెంటు సూనో అడుగుదాం. నాది కేస్ బేరం, మీరు అరువు అడగండి. ఇద్దరం ఒకే సారెల్దాం. సాపోడు నానిచ్చీ డబ్బు పుచ్చుకోకుండా ముందుగా మీకు అరువు యియ్యకపోతే యిదిగో యీ సెవి తెగ్గోసుకుంటా? ....."

మేము రైలు స్టేషను చేరేసరికి రంగం ప్రయాణం అంత పనైంది.

ఈ లోగా మరో జల్లు వచ్చింది.

స్టేషను ముందు తాగి పారేసిన బీరు సీసాల్లా పది ఖాళీ రిక్షాలు అడ్డదిడ్డంగా ఉన్నాయి. వాటి పక్కనున్న రెండు టాక్సీ

ల్లోనూ ఒకదాన్లో డ్రైవరు పది బీరుసాసాలు పట్టేసిన వాడిలా నిద్రపోతున్నాడు.

థర్డ్ క్లాస్ – తప్పు, తప్పు – సెకండు క్లాసు పాసింజరు హాల్‌కమ్ బుకింగ్ స్టేషన్లో టికెట్లూ, సిగరెట్టు, టీ, పుస్తకాలు కొనుక్కోవచ్చును.

ముష్టి ఎత్తుకోవచ్చును.

స్థలం దొరికితే పడుకోవచ్చును.

రిక్షాల వాళ్లూ, కుష్టు, కుక్కలూ, ముష్టివాళ్ళూ, పేసింజర్లు తడిసిన కాకుల్లా చలికి వణుకుతూ చెదురు బొదురుగా కూర్చున్నారు.

టీ స్టాలువాడు ఒక్కడే వెచ్చగా ఉన్నాడు.

స్టేషనులోకి వెళ్ళి హేండ్‌బేగ్ తెరిచేను. పావలా చిల్లరా, పది రూపాయల నోటూ ఉన్నాయి.

“ఎంత?” రిక్షావాడినడిగేను.

“మీ దయండి” అని నాకు దయలేదని గ్రహించో, భయపడే “రూపాయిప్పించండి” అన్నాడు.

మామూలుగాఅయితే మా ఇంటి నుంచి స్టేషనుకి చార్జి ముప్పావలే.

ఈ వరదలో రిక్షావాడు పావలానే ఎక్కువడగడం, ముప్పా వలా తక్కువ అడిగినట్టే.

“అంతెందుకయ్యా” అనబోయింది నాలోని మిడిల్‌క్లాస్ మహిళ.

“ఆవిడ్ని నోర్మూయ్” అన్నాడు నాలో దయగల ఆదిమానవుడు (మానవుడికి స్త్రీ లింగం తట్టడం లేదు).

పది రూపాయల నోటు మార్చాలి.

నేను సిగరెట్టు కాల్చను. ‘టీ’ తాగాలని ఉన్నా ఆ తక్కువ రకం స్టాల్‌లో నేను తాగకూడదు. మావారికి ప్రమోషన్ వచ్చిన దగ్గర్నుంచీ పుస్తకాలు తాహతు పోయింది. (అది వేరే కథలెండి)

నోటు మార్చే మాధ్యత తప్పించుకోవాలి. అదేం అంత కష్టమనిపించలేదు. నేను పుట్టించని చిల్లర రిక్షావాడెలా పుట్టి స్తాడో ఆలోచించకుండా (నిజం చెప్పాలంటే ఆలోచించే)

“సరే తీసుకో” అంటూ నోటు అందించేను. రాజు కూతుర్ని దాసీది అందుకున్నట్టు భక్తితో భద్రతతో అందుకున్నాడు నోటుని.

“ఉండండి, బీడీకట్ట కొంటే సిల్లరిస్తాడు” అంటూ సిగరెట్టు షాపు దగ్గరికి వెళ్ళేడు.

షాపువాడూ, ఈడూ కలిసి బూతులే తిట్టుకున్నారో, భక్తి గీతాలే పాడేరో తెలీదుకాని రెండు నిమిషాల్లో తిరిగొచ్చేడు వాడు. బాబుగారి కొడుకుని బంట్రోతు ఎత్తుకున్నట్టు యీ మారూ ఆ నోటుని భద్రంగానే పట్టుకున్నాడుగాని, దాని మీద వాడికి కొంత భక్తి తగ్గినట్టుంది.

“సెల్లదంటండి – నూనె మరక అయిందిట”

రిక్షావాడి మాట ఆ దేవుడెరుగు ప్లాట్‌ఫారం టికెట్ కొనడాని కైనా చిల్లర కావాలి.

ఈ లోగా రైలుకి గంట కొట్టడం, స్టేషను దగ్గర కొత్త ఫియట్ కారాగడం ఒక్కసారే జరిగేయి. కారు వర్షానికి కడిగి నట్టే మిలమిల మెరుస్తూంది. అంత తొందరలోనూ నేను దాని వైపు చూడకుండా వుండలేక పోయాను. మరో క్షణం చూసేక కెవ్వుమని అరుద్దామనిపించింది, ఆకారు స్టీరింగు దగ్గర్నుంచి పులిలా దిగుతున్న మావార్ని చూడగానే. అవసరమైతే ఆయన దూది పులిలా మెత్తగా ఉండగలరు. కాని ఎప్పుడూ పులి లాగే కనిపిస్తారు నాకు.

ఆ కారు మాదికాదు.

నాకూ, పిల్లలకి అన్యాయం చేసి కొత్తకారు కొనెయ్యలేదు కదా యీయన! ఆయన సంగతి మీకు తెలీదు. ఓ సారి ఒక సర్కసు ఏనుగును బేరమాడేరు, దానికి గడ్డిపెట్టడానికి డబ్బెక్క ణ్నుంచి వస్తుందని ఆలోచించకుండా.

పులి దగ్గరికొచ్చింది. నవ్వుతూనే వుంది.

అసలు పులి దెబ్బకొట్టేటప్పుడు నవ్వుతుందో, ఏడుస్తుందో తెలీదుకాని, మావారు నవ్వుతారు.

“రైల్లో వస్తానని కార్లో వచ్చేరేం?” అడిగేను “కారెవరిది?” అనడగడానికి ధైర్యం చాక.

“రైలుకి కేష్ పెట్టాలి. శర్మగాడుకారు ఎరువిచ్చేడు. బంక్ వాడు పెట్రోలు అరువిస్తాడు ..... ఏమిటది?”

అంతవరకు నోటు ఒక చివర నేను, రెండో చివర రిక్షా వాడు పట్టుకునే ఉన్నాం. ఆయనంటే నాకు భక్తి మాటెలా ఉన్నా భయం లేదని ఎవరనగరు?

"నామీదో కథ చెప్పి ఇతనిదగ్గర పది రూపాయలు పీకుతున్నావేమిటి?" మళ్ళీ అతనే అన్నాడు.

రిక్షావాడే "చిల్లర కథ" అంతా చెప్పేడు.

కథ విని "నాన్సెన్స్" అన్నారాయన!

ఆ "నాన్సెన్స్" కి అర్థం నాకర్థం అవలేదు.

"ఈ నోటు చెల్లదన్న వెధవెవరు?" నోటు లాక్కొని పులి అడిగేరు.

హమ్మయ్య! ఆ మాట నేనల్లేదు.

పులినోటు పట్టుకొని దుకాణం దగ్గర కెళ్ళింది.

అంతవరకూ కొత్త కారుని చూస్తున్నట్టు చూస్తున్న షాపువాడు అందులోంచి దిగి తన దగ్గర కొచ్చిన "ఆయన" వేపు చూసేరు.

నోటు షాపువాడి మీదికి విసిరి "ఓ గోల్డ్‌ఫ్లేక్ ఫిల్టరు" అన్నారు దూది పులిలా నవ్వుతూ ఆయన.

ఆయన అడిగింది ఒక సిగరెట్టో, సిగరెట్టు పెట్టో తెలీని షాపు వాడు ఒక సిగరెట్టు పెట్టె, మిగతా డబ్బు యిచ్చి మేము అతన్ని వదిలేక నోటు పెట్టెలో పడేసుకున్నాడు.

**(యువ, దీపావళి 10.11.1977)**

# భూమి గుండ్రంగా వుంది

**అ**ది దేవాలయం కాదు. చర్చి కాదు.

మసీదు, మరిడమ్మ గుడి అంతకంటే కాదు.

అక్కడ దేవుడూ లేడు, పూజారీ లేడు.

అయినా చాలా మందికి మతంతో సంబంధం లేకుండా (వి)ముక్తి, మోక్షం దొరుకుతాయి. నాస్తికులతోసహా.

పోనీ కమ్యూనిస్టు కార్యాలయమా? ఛ! ఛ! అయితేనేం? అక్కడ కుబేరుడి ఎక్కువ, కుచేలుడికి తక్కువ లేదు (అనుకుంటారు).

మరైతే? ఏదైనా ఆశ్రమవాఁ? అమ్మమ్మ. ఎంతమాట? అక్కడ బాబాలు, అమ్మలు మచ్చుక్కూడా లేరు. కాని అక్కడికొచ్చే చాలామంది ఆడవాళ్ళకి ప్రసూతి వైరాగ్యం, ఆడ, మగ, యిద్దరికీ స్మశాన వైరాగ్యం వస్తాయి.

అది కోర్టూ, పోలీస్టేషనూ కాకపోయినా అక్కడికి పొలాలు కలిపేసుకున్న వాళూ, ఆడవాళ్ళని అమ్మేసిన వాళ్ళూ, ఖూనీ చేసినవాళ్ళూ అయిపోయినవాళ్ళూ, పన్నులు ఎగ్గొట్టినవాళ్ళూ, పళ్ళూడగొట్టించుకున్న వాళ్ళూ. ఇలా నానా గోత్రభ్యః వస్తారు.

పాపం. ఇళ్ళలో సరదాలు తీరనివాళ్ళు తీర్చుకోవడానికి అక్కడికి వచ్చినంత మాత్రాన అది లాడ్జింగు అనుకోవడం పొరపాటు.

ఏదీ కాకపోతే మరేవిటిది?

అది శ్రీశ్రీశ్రీ గర్నమెంటువారి (ధర్మ) ఆసుపత్రి.

ఒకప్పుడది జెంగాలపాలెం జమీందారుగారి లోగిలి. జమీలు ప్రభుత్వం తీసుకున్నప్పుడు, ఈ లోగిలి కూడా ప్రభుత్వం తీసుకొని, అంతవరకు పశువుల పాకలలో వున్న ఆసుపత్రిని యిక్కడికి మార్చి, దాన్ని ఆ జమిందారుగారి చేత ప్రారంభోత్సవం చేయించింది. ఆ తరువాత కొన్నాళ్ళకి ఆ జమిందారు గారు జబ్బుచేసి యిదే ఆసుపత్రిలో కాలంచేశారు. ఈ ఆసుపత్రిక పక్కనున్న ఏటిగట్టునే మట్టిలో కలిసిపోయింది వారి భౌతిక కాయం.

మహాత్ముల ఆత్మలైతే దేశాన్ని పట్టుకొని వేళ్ళాడుతాయి. ముష్టివెధల ఆత్మలైతే పట్టుకోవడానికేం వుండవు కనుక పిశాచాలై